


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 100 | బుధవారం 09 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## సోషల్ మీడియాను ఎంతమంది యాక్టివ్‌గా వాడుతున్నారు

● సోషల్ మీడియా వినియోగంపై టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం ● ప్రభుత్వ అభివృద్ధి పనులనుప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన ● ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని సోషల్ మీడియాలో తిప్పికొట్టాలని పిలుపు ● ప్రధానిమోదీని, తనను ఉదాహరణగా చూపుతూ నేతలకు దిశానిర్దేశం ● అమరావతి అభివృద్ధిని విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశం

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' అనే అంశంపై మాట్లాడుతూ, ఆయన నేరుగా సభికులను "మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్న తోనే సాంకేతికతను రాజకీయ ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు.



2

## మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా



● దళిత వర్గానికి చెందిన స్పీకర్ కు గౌరవం ఇవ్వడం లేదన్న సీతక్క ● సబితను తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుందన్న మంత్రి ● మహిళా పోలీసు అధికారులపై బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని వెల్లడి

శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత హేయమైన, అనుచిత వ్యాఖ్యలు చేసి, ఇప్పుడు ఏమీ ఎరుగనట్లు తప్పించుకోవాలని చూస్తున్నారని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్ నేతల తీరును ఎండగడుతూ తీవ్ర భావోద్వేగానికి మిగతా2లో

## డీఎస్సీపై వైసీపీ చేస్తున్నది 100 శాతం దుష్ప్రచారమే: ఎమ్మెల్యే బోడే ప్రసాద్

టీడీపీ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్నది 100 శాతం దుష్ప్రచారమేనని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ఈ తరహా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిందని ఆయన ఆరోపించారు.



2

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిల పై సస్పెన్షన్ వేటు



●బీఆర్ఎస్ ఎమ్మెల్సీల పై చర్యలు తీసుకోవాలని శాసనసభలో తీర్మానం ●తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహ ●స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే ఇందుకు కారణం ●కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని తీర్మానంలో డిమాండ్

## తెలంగాణ పోలీసు ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు




● సెప్టెంబర్ 16 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ● మొత్తం 7,437 పోస్టుల భర్తీకి జూలై 29న నోటిఫికేషన్ ● ఇప్పటివరకు 2.88 లక్షల మంది దరఖాస్తు ప్రక్రియ పూర్తి ● చివరి నిమిషంలో సాంకేతిక సమస్యలు రావొచ్చని బోర్డు సూచన



## ఇరాన్‌తో యుద్ధంలో గెలిస్తే గ్యాలన్ పెట్రోల్ 2 డాలర్లకే

●ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు పడిపోతాయన్న ట్రంప్ ●గ్యాలన్ పెట్రోల్ ధర 2 డాలర్ల కంటే తక్కువకు వస్తుందని జోస్యం ●ట్రూత్ సోషల్ వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించిన అధ్యక్షుడు ●ఇరాన్ ఇంధన వనరులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఇరాన్ హెచ్చరిక ●ప్రస్తుతం అమెరికాలో గ్యాలన్ పెట్రోల్ ధర 4.15 డాలర్లుగా ఉంది

2

## ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం..



● వైరల్ అవుతున్న వీడియో ఇదిగో! ●ఇండోనేషియాలో అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలైన వైనం ●దట్టమైన బూడిద కారణంగా 8 విమానాశ్రయాలు మూసివేత, 2300 ఫ్లైట్లు రద్దు ●విమానాశ్రయాల్లో చిక్కుకున్న సుమారు 2.70 లక్షల మంది ప్రయాణికులు ●సునామీ ప్రమాదం లేదన్న అధికారులు, లెవెల్-3 హెచ్చరికలు జారీ

## 'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'.. కేటీఆర్ సంచలన ఆరోపణలు

● కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని విమర్శ ● ప్రభుత్వం పై డైవర్షన్ రాజకీయాల ఆరోపణ ● అసెంబ్లీలో ప్రజా సమస్యల పై చర్చించాలని డిమాండ్ ● దళిత, గిరిజన హామీలు అమలు చేయాలని డిమాండ్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. మిగతా2లో



## అసెంబ్లీ వ్యవహారం.. హైకోర్టులో వాడీవేడి వాదనలు..

అసెంబ్లీ బయట జరిగిన ఘటన పై తెలంగాణ హై కోర్టు వెలువరించిన ఉత్తర్వుల పై రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. నిన్నటి ఉత్తర్వులను సవరించాలంటూ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దంటూ మిగతా2లో



VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 09 సెప్టెంబర్ 2026

## తెలంగాణ పోలీసు ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు

తెలంగాణలో పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) కీలక ప్రకటన చేసింది. కానిస్టేబుల్ స్థాయి పోస్టుల దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్లు బోర్డు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 9వ తేదీతో ఈ గడువు ముగియాల్సి ఉండగా, అభ్యర్థుల సౌకర్యార్థం సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,437 పోస్టుల భర్తీ కోసం టీఎస్ఎల్‌పీఆర్‌బీ జూలై 29న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో సివిల్ కానిస్టేబుల్ (3,697), ఏఆర్ కానిస్టేబుల్ (1,052), స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ (1,380), ఫైర్ ఫైటర్ (751), జైల్ వార్డర్ (208), ఎస్‌ఏఆర్ సీపీఎల్ (24) పోస్టులు ఉన్నాయి. ఈ ఉద్యోగల కోసం ఇప్పటివరకు 3,38,336 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, వారిలో 2,88,530 మంది ఫీజు చెల్లించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేశారు. ఆధార్ వెరిఫికేషన్ సైతం 95 శాతానికి పైగా పూర్తయినట్లు బోర్డు తెలిపింది. గడువు ముగిసే ఆఖరి రోజుల్లో దరఖాస్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని బోర్డు పేర్కొంది. కాబట్టి అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు టీఎస్ఎల్‌పీఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

## 'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'.. కేటీఆర్ సంచలన ఆరోపణలు

ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్‌రెడ్డికి మరో విద్య తెలియదు" అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. దళితులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ కోరారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి.. కనీసం రూ.12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని.. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలే సమాధానం చెబుతారని కేటీఆర్ అన్నారు.

## ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం..

ఇండోనేషియాలోని సుప్రసిద్ధ అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దల వడం తెలిసిందే. సుమారు 25 గంటల పాటు నిరంతరాయంగా లావా, బూడిద వెదజల్లడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెల కొన్నాయి. ఈ విస్ఫోటనం కారణంగా ఆకాశమంతా దట్టమైన బూడిద మేఘాలు అలుముకోవడంతో రవాణా వ్యవస్థ, ముఖ్యంగా విమాన సర్వీసులు పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ అగ్నిపర్వతం 24 గంటల పాటు ఏకధాటిగా లావాను వెలిగక్కింది. ఈ విస్ఫోటానికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆకాశంలో దట్టమైన బూడిద వ్యాపించడంతో ముందుజాగ్రత్త చర్యగా జకార్తాలోని సోకర్నో-హట్టా, హలిమ్ పెర్దనకుసుమ అంతర్జాతీయ విమానాశ్రయాల తో సహా మొత్తం 8 ఎయిర్‌పోర్టులను తాత్కాలికంగా మూసివేశారు. ఈ నిర్ణయంతో సుమారు 2,300 విమాన సర్వీసులు రద్దు లేదా దారి మళ్లించారు. దీనివల్ల దాదాపు 2.70లక్షల మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయారు. ఇండోనేషియా జియోలాజికల్ ఏజెన్సీ లెవెల్-3 (హై అలర్ట్) హెచ్చరికను జారీ చేసింది. స్థానికంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరిన్ని విస్ఫోటనాలు సంభవించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే, ఈ విస్ఫోటనం వల్ల సునామీ ప్రమాదం ఏమీ లేదని అధికారులు స్పష్టం చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. 2018లో ఇదే అగ్నిపర్వతం బద్దలైనప్పుడు సంభవించిన సునామీ కారణంగా సుమారు 430 మంది మరణించిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి బూడిద, విష వాయువులు,వేడి రాళ్ల ముప్పు మాత్రమే ఉందని తెలిపారు. పరిస్థితి వేగంగా మారుతున్నందున విమానాశ్రయాల పునఃప్రారంభంపై ఇప్పుడే స్పష్టత ఇవ్వలేమని రవాణా శాఖ మంత్రి దుదీ పుర్వగంధీ పేర్కొన్నారు. ప్రయాణికులు ఎప్పటికప్పుడు తమ విమానయాన సంస్థల ను సంప్రదించాలని సూచించారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటంతో ఇండోనేషియాలో తరచూ ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుంటాయి.

# సోషల్ మీడియాను ఎంతమంది యాక్టివ్ గా వాడుతున్నారు

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' అనే అంశంపై మాట్లాడుతూ, ఆయన నేరుగా సభికులను "మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతోనే సాంకేతికతను రాజకీయ ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. "సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలకు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ప్రధాని మోదీ సైతం తన సందేశాలను సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టు శంకుస్థాపన, డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారం వంటి అంశాలపై సెల్ఫీ వీడియోలు తీసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచానని తెలిపారు. విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత నేతలపై ఉందని అన్నారు. ప్రతిపక్షాల తీరుపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం పని కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమేనని, వారి దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ నాయకుడు 'జగన్ మావిగన్' అంటే గుడ్డిగా సమర్థిస్తున్నారని, కానీ టీడీపీ అలా కాకుండా వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

# మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా

శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత హేయమైన, అనుచిత వ్యాఖ్యలు చేసి, ఇప్పుడు ఏమీ ఎరుగనట్లు తప్పించుకోవాలని చూస్తున్నారని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్ నేతల తీరును ఎండగడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "సభలో దళిత వర్గానికి చెందిన స్పీకర్ స్థానానికి గౌరవం ఇవ్వకపోగా, గతంలో ఎప్పుడో మరణించిన ఆయన మాతృమూర్తిని ఉద్దేశించి అంత నికృష్టమైన భాష మాట్లాడటం ఏ రకమైన సంస్కారం?" అని నిలదీస్తూ కంటతడి పెట్టారు. సీతక్క ఆవేదన చూసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకోవడంతో వాతావరణం అత్యంత గంభీరంగా మారింది. సభలో ప్రతిపక్ష నేతల తీరుపై మండిపడ్డ సీతక్క... "సబితా ఇంద్రారెడ్డిని నిజంగా తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుంది. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టుకుని రావడం ఏంటి? హరీశ్ రావు మహిళల ముందు బట్టలు విప్పుతారా?" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. "మహిళా ప్రజాప్రతినిధులను సురక్షిత ప్రాంతానికి పంపి, ఆ తర్వాత పురుష నేతలు నిరసనకు రావడం పద్ధతి. కానీ మహిళలను అడ్డుగా పెట్టుకుని రాజకీయం చేయడం దారుణం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న మహిళా పోలీస్ అధికారులపై బీఆర్ఎస్ నేతలు చేయిచేసుకుని, దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని, చట్టాన్ని ఉల్లంఘించి పోలీసులను కొట్టిన ఎమ్మెల్యేలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టసభలు దేవాలయం లాంటివని, బీఆర్ఎస్ మహిళా నేతలు ఈ విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. "సొంత చెల్లెలు కవితను పార్టీ నుంచి బహిష్కరించినప్పుడు లేని బాధ, హరీశ్ రావును ఏదైనా అంటే ఎందుకు వస్తోంది?" అని సీతక్క బీఆర్ఎస్ నేతలను సూటిగా ప్రశ్నించారు.

# డీఎస్సీ పై వైసీపీ చేస్తున్నది 100 శాతం దుష్ప్రచారమే: ఎమ్మెల్యే బోడే ప్రసాద్

టీడీపీ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్నది 100 శాతం దుష్ప్రచారమేనని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ఈ తరహా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిందని ఆయన ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ నుంచి నీటిని విడుదల చేయడంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో తమ ఓటు బ్యాంకుకు నష్టం జరుగుతుందనే భయం వైసీపీని వెంటాడుతోందని బోడే ప్రసాద్ అన్నారు. అందుకే ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ భుజానికెత్తుకున్నారని విమర్శించారు. డీఎస్సీలో మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులపై కూడా అక్రమాలు జరిగాయంటూ ఒక పత్రికను అడ్డుపెట్టుకుని విష ప్రచారం చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గంలోని ఇద్దరు అక్కాచెల్లెళ్ల ఉదంతాన్ని ఆయన ఉదహరించారు. సొంత ఇల్లు కూడా లేక అద్దె ఇంట్లో ఉంటున్న ఆ యువతులు కష్టపడి చదివి డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని, వారిలో ఒకరు 2019లో కేవలం ఒక్క మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయారని తెలిపారు. ఐదేళ్ల తర్వాత వారి కల నెరవేరితే, వారి మెరిట్‌ను కూడా ప్రశ్నిస్తూ వైసీపీ నేతలు అవమానించడం బాధాకరమన్నారు. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వారు గతంలో యువత జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు. గతంలో వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో చేసిన తరహాలోనే ఇప్పుడు డీఎస్సీ అభ్యర్థులపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన వేలాది మంది యువత సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. యువత తిరగబడితే దాని ప్రభావం ఎలా ఉంటుందో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి తెలుస్తుందని అన్నారు. డీఎస్సీపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజల్లోకి వెళ్లి తిప్పికొడతామని బోడే ప్రసాద్ స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిల పై సస్పెన్షన్ వేటు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ సమావేశాల కాలం మొత్తం వారిని సస్పెండ్ చేస్తున్నట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తాతా మధు, నవీన్ కుమార్‌ల పై కాంగ్రెస్ పక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

**తీర్మానం ప్రవేశపెట్టిన దామోదర**

స్పీకర్‌పై అగౌరవంగా మాట్లాడటంతో పాటు, అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ, ఎస్సీల చరిత్ర జాతీయ ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని, దానిని కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం చేయకూడదని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, కానీ రాజ్యాంగబద్ధమైన పదవులను, వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని స్పష్టం చేశారు. "స్పీకర్ పదవి ఏ ఒక్క కులానికో, మతానికో సంబంధించినది కాదు. ఆ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించడం క్షమించరాని నేరం" అని ఆయన వ్యాఖ్యానించారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతల అహంకారం తగ్గలేదని, ప్రజాజీవితంలో ఉన్నవారు బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. మంత్రి దామోదర ప్రవేశపెట్టిన తీర్మానానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పూర్తి మద్దతు తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీలో ఈ తీర్మానం ఆమోదం పొందిన అనంతరం, అధికారిక కాపీని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పంపించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు ఎమ్మెల్సీలపై మండలిలో చర్యలు తీసుకున్నారు.

# అసెంబ్లీ వ్యవహారం.. హైకోర్టులో వాడీవేడి వాదనలు..

ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దంటూ పోలీసులను ఆదేశించింది ఎవరని న్యాయస్థానం ప్రశ్నించింది. ప్రతిపక్షాల ఎమ్మెల్యేలను అడ్డుకొని అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలంటూ డీజీపీకి హైకోర్టు ఆదేశించింది. ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఎదుట బైఠాయించారని ఏజీ సుదర్శన్ రెడ్డి న్యాయస్థానానికి తెలిపారు. ఫ్లకార్డులు, వ్యతిరేక రాతలతో ఉన్న టీషర్టులు ధరించి అసెంబ్లీ లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారని ఏజీ చెప్పుకొచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ఎమ్మెల్యేలను అడ్డుకున్నారని వెల్లడించారు. శాసనసభ్యుల నియమావళిని ఉల్లంఘించినందుకే పోలీసులు అడ్డుకున్నారని ఏజీ చెప్పారు. నిషేధాజ్ఞలను సైతం ఉల్లంఘించారని అన్నారు. విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుళ్లను సైతం దూషించారన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులను కొంతమంది ఎమ్మెల్యేలు నెట్టివేసి అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాల్సిన అధికారం అసెంబ్లీ స్పీకర్‌పై ఉంటుందని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. సభ సజావుగా జరిగేలా చూడాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉంటుందని ఏజీ తెలిపారు. స్పీకర్ ఆదేశాల మేరకు చీఫ్ మార్షల్స్, పోలీసులు శాసనసభ్యులను అడ్డుకున్నారని ఏజీ వెల్లడించారు. బీఆర్ఎస్ శాసనసభ్యులు నల్ల టీషర్టులు ధరించి ప్రజల్లో భయానక వాతావరణం సృష్టించేలా వ్యవహరించారని ఏజీ అన్నారు.

# ఇరాన్‌తో యుద్ధంలో గెలిస్తే గ్యాలన్ పెట్రోల్ 2 డాలర్లకే

ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు భారీగా పడిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్యాసోలిన్ ధర గ్యాలన్‌కు 2 డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇరాన్‌తో యుద్ధంలో మనం గెలిచినప్పుడు, మిగతావన్నీ పడిపోతున్నట్లే చమురు ధరలు కూడా వేగంగా పడిపోతాయి. మొదట గ్యాలన్ ధర మూడు డాలర్లకు, ఆ తర్వాత రెండు డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుంది. ఇదంతా చాలా వేగంగా జరిగిపోతుంది. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని తయారు చేయలేదు. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (ఎంఏజీఏ)!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో గ్యాసోలిన్ సగటు ధర గ్యాలన్‌కు సుమారు 4.15 డాలర్లుగా ఉంది. లేబర్ డే సమయంలో ఇది రికార్డు స్థాయి కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్‌కు 97డాలర్ల వద్ద, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) 92 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# సంపాదకీయం

## మన కాలపు నిప్పు గొంతుక



ప్రపంచ చరిత్ర అంటే ప్రముఖుల జీవిత సారాంశమే' అని ప్రసిద్ధ సామాజిక తత్వవేత్త థామస్ కార్లైల్ వ్యాఖ్యానించాడు. ప్రముఖుల జీవితతత్వాన్ని అర్థం చేసుకుంటే తప్ప ప్రపంచ చరిత్రను అధ్యయనం చేయడం, అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. ఆధునిక కాలాన్ని తీర్చిదిద్దిన ప్రపంచ విప్లవాలు, ఉద్యమాలు, పోరాటాలు ప్రముఖుల జీవితాలతో పెనవేసుకుని ఉంటాయి. తమ తమ జాతులను, ప్రాంతాలను ఆధిపత్య శక్తుల సంకెళ్ల నుంచి బంధ విముక్తం చేయడానికి పలువురు చారిత్రక పురుషులు నిర్విరామ కృషి చేశారు. అటువంటి ప్రముఖుల జాబితాలోనే కాళోజీ నారాయణరావుకు చోటు దక్కుతుందనడంలో సందేహం లేదు. ఒక శతాబ్ది భారత సామాజిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక, ఆర్థిక పరిణామాలకు-- ప్రత్యేకించి తెలంగాణ చరిత్రకు కాళోజీ జీవితం ఒక ప్రతిబింబం.మూడు తరాల ఉద్యమ వారధి-- ఒకే జీవితంలో రాష్ట్రావతరణ కోసం, రాష్ట్ర విభజన కోసం నినదించిన నిప్పు గొంతుక. తెల్లదొరలపై జెండా ఎత్తినా, రజాకార్లపై రంకెలువేసినా, నల్ల దొరలపై నగారా మోగించినా ఎక్కడా కట్టు తప్పని మడమ తిప్పని, పట్టువదలని విప్లవ సేనాని. రాజీలు, లాలూచీలకు తలవొగ్గని నిగ్రహం ఆయన సొంతం. దోపిడీని, ఆధిపత్యాన్ని, అణచివేతను, అసమానత్వాన్ని, అంతరాలను ఎంతమాత్రమూ సహించని కాళోజీ 1914లో మొదటి ప్రపంచ యుద్ధంతోపాటే పుట్టారు. 'రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరావు రాంరాజా కాళోజీ నారాయణరావు' ఆయన పూర్తిపేరు. రెండు ప్రపంచ యుద్ధాల నడుమ ఆయన ఉద్యమ జీవితం కొనసాగింది. కాళోజీ జీవితం, ఆలోచన, ఆచరణ, ఆశయం విశిష్టమైనవి. ఆయన మూడు వేర్వేరు ప్రజా పోరాటాల్లో-- స్వాతంత్ర్య పోరాటం, నిజాం వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల్లో పాలకుల నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా ధిక్కార స్వరాన్ని ఎక్కుపెట్టారు. మరీ ప్రధానంగా కాళోజీ జీవితం--తెలంగాణ ఉద్యమం పరస్పరం పెనవేసుకొని వున్నాయి. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ గూర్చి కాళోజీ రాసిన పంక్తులు-- 'పుట్టుక నీది, చావు నీది-- బ్రతుకు దేశానిది'-- ఇవే అక్షరాలా కాళోజీ జీవితానికి వర్తిస్తాయి. ఇక్కడ బ్రతుకు తెలంగాణది. తన జీవితకాలంలో తలెత్తిన సమస్త ఉద్యమాలతో మమేకమై అలుపెరుగక పోరాడిన యోధుడు కాళోజీ. ఆర్యసమాజం, ఆంధ్రమహాసభలు, గ్రంథాలయోద్యమం, గణపతి ఉత్సవాలు, రజాకార్ల వ్యతిరేక ఉద్యమం, తెలంగాణ రైతాంగ పోరాటం, స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహాలు, విశాలాంధ్ర ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, పౌరహక్కుల పోరాటం, అత్యవసర పరిస్థితి వ్యతిరేక పోరాటం, సారా వ్యతిరేకోద్యమం-- ఇలా అన్ని ఉద్యమాలలో ప్రజల పక్షాన గళమెత్తి కలమెత్తిన సమరయోధుడు.కాళోజీ సంభాషణల్లో అచ్చతెలంగాణ యాస, భాష ఎంతో సహజంగా, సరళంగా, స్వేచ్ఛగా కనిపిస్తాయి. తెలంగాణ భాషను యాసను వెక్కిరించిన వారికి చింతబరిగెలతో చురకలంటించేవారు. రెండున్నర జిల్లాల, రెండున్నర కులాల భాషా సాంస్కృతిక ఆధిపత్యాన్ని నిరసించారు. 'మా రచనల్లో వ్యాకరణం మాత్రమే లేదు. మీ రచనంతా వ్యాకరణం తప్ప మరేమీ లేదు' అని తెలంగాణ కవులను విమర్శించే వారికి సమాధానమిచ్చాడు. కాళోజీ దృష్టిలో భాష రెండు తీర్లు-- ఒకటి బడి పలుకుల భాష, రెండోది పలుకుబడుల భాష. పలుకుబడుల భాషే కావాలంటారాయన, అమ్మ భాషను అవహేళన చేసిన వారికి ఇలా వాత పెడతారు... 'తెలుగు బిడ్డవురోరి తెలుగు మాటలాడుటకు/ సంకోచపడియెదవు సంగతేమిటిరా/ అన్య భాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు/ సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా'. అక్షరాన్ని కాళోజీ అమితంగా ప్రేమిస్తారు. అక్షరమే ఆయుధమంటారు. అక్షరాలకు గెరిల్లా శిక్షణ ఇచ్చి అన్యాయంపై ముప్పేట దాడి చేస్తారు. 'అక్షర రూపం దాల్చిన ఒక్క సిరా చుక్క లక్షల మెదళ్లకు కదలిక' అన్న ఒకే ఒక్క వాక్యం యువతరాన్ని చదువులవైపు మరల్చిందని చెప్పడంలో సందేహం లేదు. బడుగు బలహీనులను, అభాగ్యులను అణచివేయడాన్ని కాళోజీ తిరస్కరించారు. ఆధిపత్యాన్ని ధిక్కరించారు. మంచితనాన్ని, మనిషితనాన్ని, ప్రజాస్వామిక మానవీయ విలువలను ప్రేమించారు. అదే ఆయన తత్వం--వ్యక్తిత్వం. తెలంగాణ సాహిత్యంలో శిఖర సమానుడు, ఉద్యమాలను ఊపిరిగా చేసుకున్న కాళోజీ గూర్చి-- 'కాలుడు మా కాళయ్యను కలకాలం మరచుగాక' అని ఆయన ఆప్త స్నేహితుడు పీవీ నరసింహారావు ఎంతగా వేడుకున్నా, కాళోజీ వినకుండా.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందాలి







**-పింఛన్ దరఖాస్తు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్**

**-దరఖాస్తుదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి**

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

నంద్యాల, సెప్టెంబరు 8 వార్త సాక్ష్యం

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా, పారదర్శకంగా, సకాలం లో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళ వారం నంద్యాల పట్టణంలోని అయ్యలూరు మెట్ట 1, 2 స్వర్ణ వార్డులను జిల్లా కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా నూతనంగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే విధానాన్ని స్వయంగా పరిశీలించి, దరఖా స్తుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసు కున్నారు. ఒక్కో దరఖాస్తు ప్రక్రియకు పడుతున్న సమయం, దరఖాస్తుకు అవసరమైన పత్రాలు, అర్హత ప్రమాణాలు తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ కోసం వచ్చే వృద్ధులు, ఇతర లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచిం చారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ పథకం ప్రయోజనం అందేలా సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# మహిళల రక్షణకు శక్తి యాప్ పై అవగాహన





**-మహిళలు, పోలీస్ చట్టాలపై అవగాహన కల్పించుకోవాలి**

**-పాములపాడు ఏఎస్ఐ షేక్. నూర్ మహమ్మద్**

ఆత్మకూరు సెప్టెంబర్ 8 వార్త సాక్ష్యం

ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ " శక్తి యాప్ టీం " ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ,సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు,ఆత్మకూరు డి.ఎస్.పి ఆర్. రామాంజి నాయక్ ఉత్తర్వుల మేరకు ఆత్మకూరు అర్బన్ సీఐ ఓ. మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణ లో సోమవారం మండల పరిధిలోని చరక కాలనీలో మహిళలకు " శక్తి యాప్ పై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఎస్ఐ షేక్.నూర్ మహమ్మద్ మాట్లాడుతూ బాలికల, మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన శక్తి యాప్ ఉపయోగాలను మహిళలు సద్వినియోగం చేసుకో వాలని తెలియజేశారు ఏదైనా ప్రమాదం ఉంటే వెంటనే వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి, బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు చేయవలెనని, 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని అట్లా ఎవరయినా చేస్తునట్లయితే 112 కు గానీ, 1098 కి ఫోన్ చేసి చెప్పాలని తెలుపుతూ..ఉమన్ వెల్ఫేర్ 181, ఎమర్జెన్సీ కాల్ 112, 100 కి ఫోన్ చేయవలెనని, సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయవలెనని, ఫేక్ కాల్స్,ఏపీకె ఫైల్స్ లాంటివి ఏదన్నా సెల్ ఫోన్ వాట్సప్ లకు ఎవరైనా లింక్ మెసేజ్లు పంపితే వాటిని ఓపెన్ చేయొద్దు అని తెలుపుతూ వాటి ద్వారా వారికీ జరిగే ఆర్థిక నష్టాలను గురించి కూడా తెలిపి,వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు ఆండ్రాయిడ్ సెల్ ఫోన్లలలో శక్తీ యాప్ డౌన్ లోడ్ చేసుకొని అత్యవసర సమయాలలో శక్తీ యాప్ ను ఎలా వాడాలి, దానీ ఉపయోగాల గురించి తెలుపడమే కాకుండా శక్తీ యాప్ ను వారి సెల్ ఫోన్ లలో డౌన్లోడ్ చేయించి ఎవరైనా మీకు ఇబ్బంది పెట్టినట్లయితే అధైర్య పడకుండా మీకు రక్షణ గా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన " శక్తీ యాప్ " ను ఉపయోగించి 112 కు గానీ 1098 కి గానీ ఫోన్ చేసి పోలీస్ వారి సహాయం పొందవచ్చు అని అవేర్నెస్ చేసినాము. అదేవిధంగా 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న మైనర్ విద్యార్థులు ఎవరు కూడా మోటార్ సైకిల్ ను నడపడానికి ఇవ్వద్దని తెలియజేశారు మీ ఇంట్లోని మోటార్ సైకిళ్లను నడిపేటప్పుడు ఖచ్చితంగా తలకు రక్షణగా " హెల్మెట్ " పెట్టుకొని ప్రయాణం చేయాలని హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతను తెలిపి మరియు ఎవ్వరూ కూడా మీ ఇంట్లోని వారు మీ భర్త,కొడుకు,అన్నా,తమ్ముడు,మేనమామ లు ఎవ్వరైనా సరే మద్యం త్రాగి వాహనాలను నడపవద్దని చెప్ప మని సూచిస్తూ...త్రాగి వాహనం నడిపితే పోలీసులకు చిక్కి కేసు పెడితే కోర్టు వారు 10 వేల రూపాయలు ఫైన్ లేదా జైలు శిక్ష ను విధిస్తారు అని చరక కాలనీ మహిళలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్ర మంలో పోలీస్ సిబ్బంది కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల భూ సమస్యలు రెవెన్యూ అధికారులు పరిష్కరించండి





**-జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు**

పాములపాడు సెప్టెంబర్ 8 వార్త సాక్ష్యం

మండలంలో పేద ప్రజల భూ సమస్యలు రెవెన్యూ శాఖ అధికారులు త్వరగా పరిష్కరించి రైతులకు వెంటనే న్యాయం చేయాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు అన్నారు. సోమవారం పాములపాడు మండల తాసిల్దార్ కార్యాలయంలో ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కే. వెంకట శివకు, వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరిగిన రి సర్వేలో భూమి కొలతలు సరిగ్గా లేక రైతులకు దాదాపు 30 సీట్లు భూమి 40 చెట్ల భూమి కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఒకే సర్వేనెంబర్ లో ఐదు సబ్ డివిజన్ అయితే ఒక్క సబ్ డివిజన్లో రోడ్డు పోతే వేరే సబ్ డివిజన్లోభూమిలో తక్కువ చేసి చూపిస్తున్నారు ఇదేంటని అడిగితే ఆ సబ్ డివిజన్ 22 ఏ లో ఉన్నందున దాని భూమి తక్కువ చేయకూడదని పక్కా సబ్ డివిజన్లో తక్కువ చేసి చూపిస్తు రెవెన్యూ అధికారులు కొంతమంది రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆయన అన్నారు. వెంటనే విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాల ని ఆయన డిమాండ్ చేశారు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిరుపేద ప్రజలకు రైతులకు తక్షణమే సమస్య పరిష్కారం చూపే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని లింగాల నాగరాజు అధికా రులను కోరారు.

# నిరుపేద కుటుంబానికి అండగా సీఎం రిలీఫ్ ఫండ్

**-సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.51 లక్షల వైద్యసాయం మంజూరు**

**-ఆపత్కాలంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి**

ఆత్మకూరు సెప్టెంబర్ 8 వార్త సాక్ష్యం

శ్రీశైలం మండల పరిధిలోని సున్నిపెంట గ్రామానికి చెందిన గాలిముట్టి నరసయ్య ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ కు గురై గుంటూరులోని కిమ్స్ శిఖర ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించక చికిత్స ఖర్చులు భరించడం కుటుంబానికి భారంగా మారిన నేపథ్యంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అండగా నిలిచారు.రోగి పరిస్థితిని అర్థం చేసుకున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్యసాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఎల్ ఓ సి, ద్వారా మెరుగైన చికిత్స కోసం రూ.2,51,532 లు మంజూరు చేయించారు. ఈమేరకు కుటుంబ సభ్యులకు మంజూరు పత్రాన్ని మంగళవారం విజయవాడలో అందజేశారు.ఈ సహాయంతో



నరసయ్యకు అవసరమైన వైద్య చికిత్స కొనసాగించేందుకు మార్గం సుగమమైంది. ఆపదలో ఉన్న తమ కుటుంబానికి అండగా నిలిచి, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, తమ సమస్యను మానవతా దృక్పథంతో పరిష్కరించేందుకు చొరవ చూపిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డికి నరసయ్య కుటుంబ సభ్యులు హృదయపూర్వక



కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో ప్రభుత్వం అండగా నిలిచిందని ఎమ్మెల్యే మా సమస్యను పట్టించుకుని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వైద్యం కోసం సహాయం అందడంతో మా కుటుంబానికి ఎంతో ధైర్యం వచ్చింది. ఈ సహాయాన్ని జీవితాంతం మర్చిపోలేం అంటూ కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనయ్యారు.

# అక్షరాస్యతతోనే సమాజ అభివృద్ధి

**-న్యాయవాది కోడి మోహన్ రావు**

మార్కాపురం సెప్టెంబర్ 8 వార్త సాక్ష్యం

ప్రతి ఏడాది సెప్టెంబర్ 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అక్షరాస్యత ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని, విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, సాధికారత, ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని ఈ రోజు ప్రజలకు అవగాహన కల్పిస్తుంది. 1966లో యునెస్కో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ప్రకటించగా, 1967 నుంచి ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 2026లో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం 60వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఈ ఏడాది "ప్రజలు, భూమి మరియు సౌభాగ్యం కోసం అక్షరాస్యత" అనే ఇతివృత్తంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అక్షరాస్యత అంటే కేవలం చదవడం, రాయడం మాత్రమే కాకుండా నేటి డిజిటల్ యుగంలో సమాచారాన్ని అర్థం చేసుకోవడం, సరైన సమాచారాన్ని గుర్తించడం, సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించుకోవడం కూడా ముఖ్యమని యునెస్కో పేర్కొంటోంది. ప్రపంచ వ్యాప్తంగా అక్షరాస్యతలో గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, 2024 నాటికి సుమారు 739 మిలియన్ల యువత, పెద్దలకు ప్రాథమిక అక్షరాస్యత నైపుణ్యాలు ఇంకా లేవు. అందువల్ల పేదలు, గ్రామీణ ప్రాంత ప్రజలు, మహిళలు, అణగారిన వర్గాలకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యావేత్తలు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉంది. "ప్రతి ఒక్కరికీ విద్య--ప్రతి కుటుంబానికి అక్షరాస్యత" అనే లక్ష్యంతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ద్వారా అక్షరాస్యతను సామాజిక ఉద్యమంగా మార్చాలని విద్యావేత్తలు, మేధావులు పిలుపునిస్తున్నారని న్యాయవాది కోడి మోహన్ రావు



తెలియజేశారు.

# స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం విజయవాడ ధర్నాను జయప్రదం చేయాలి

నందికొట్కూరు సెప్టెంబర్ 8 వార్త సాక్ష్యం

అఖిలభారత స్కీమ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐసీసీటీయూ) ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో అంగన్వాడీ, ఆశా, మున్సిపల్ వర్కర్స్, మధ్యాహ్న భోజన కార్మికులు తదితర స్కీమ్ వర్కర్ల సమస్యలపై చేపట్టబోయే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్కీమ్ వర్కర్స్ గౌరవ అధ్యక్షులు, జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని ఏఐసీసీటీయూ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, అసంఘటిత రంగంలో గౌరవ వేతనాల పేరుతో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లు సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. సంవత్సరాల తరబడి వెట్టి చాకిరీ చేయించుకుంటూ, తమ వేతనాలు పెంచాలని కోరుతున్న కార్మికులను వివిధ యాప్‌ల పేరుతో, రాజకీయ వేధింపులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో వేతనాలు పెంచుతామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారని, అయితే ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలపై ఉన్న శ్రద్ధ స్కీమ్ వర్కర్ల సంక్షేమంపై ప్రభుత్వానికి లేదని అన్నారు. మహిళా సాధికారత, మహిళా భద్రత, మహిళలను శక్తివంతులుగా తీర్చిదిద్దుతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నప్పటికీ, ఆచరణలో మహిళా కార్మికులను అనేక రకాలుగా వేధింపులకు గురిచేస్తున్నాయని విమర్శించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ



కార్మికుల వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.42,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచే ప్రయత్నాలపై చూపుతున్న శ్రద్ధ కార్మికుల వేతనాలు పెంచడంపై చూపడం లేదని అన్నారు.

**-ప్రధాన డిమాండ్లు**

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి స్కీమ్ వర్కర్లందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, పాఠశాల పారిశుద్ధ్య కార్మికులు, ఆయాలు, డ్వాక్రా వీవోలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు తదితర స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.42,000 చెల్లించాలి.

**- స్కీమ్ వర్కర్లందరికీ ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి.**

పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను వర్తింపజేయాల కార్మికులపై విధిస్తున్న యాప్ ఆధారిత వేధింపులను, అనవసరమైన యాప్‌లను రద్దు చేయాలి. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలి రూ.5 లక్షల గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలి పెండింగ్‌లో ఉన్న రూ.19.70 కోట్ల గ్రాట్యుటీ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.ఈ డిమాండ్ల సాధన కోసం విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమంలో స్కీమ్ వర్కర్లందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిక్కిలి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా నాయకురాలు బి. మల్లేశ్వరమ్మ, ఏఐసీసీటీయూ కార్మిక సంఘం నాయకులు కె. స్వామన్న, ఎస్. షేక్షావలి, మహబూబ్ బాషా, శ్రీనివాసులు, టోనీ, రైతు సంఘం నాయకులు నాగన్న తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల మున్సిపల్ ఎన్నికల పోటీపై అఖిల పక్ష ఐక్య వేదిక కసరత్తు

**-నంద్యాల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ యం. వి. రమణారెడ్డిని ప్రతి పాధించే అవకాశం.**

నంద్యాల సెప్టెంబర్ 8 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగబోయే కార్పొరేషన్ పురపాలక సంఘం ఎన్నికలకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో నంద్యాల జిల్లా మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్టు ఎం.వి. రమణారెడ్డి, ప్రతిపాదించే విషయం మెండుగా కనిపిస్తుంది త్వరలో జరగబోయే స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో ఎం.వీ రమణారెడ్డికి అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో కసరత్తు మొదలైంది ఈ నేపథ్యంలోనే నంద్యాల మున్సిపాలిటీని, నంద్యాల మున్సిపల్ కార్పొరేషన్ గా ఆఫ్ గ్రేడ్ చేసి ప్రత్యేక గ్రాంట్ క్రింద రాష్ట్ర ప్రభుత్వం రూ. 1000 కోట్ల నిధులు విడుదల చేయాలని, వ్యవసాయ పరిశోధనలకు అడ్డంకిగా మారిన తాత్కాలిక నంద్యాల జిల్లా కలెక్టరేట్ ను, రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు ఇచ్చిన హామీ మేరకు ఖాళీ చేసి, ఇతర అనువైన ప్రాంతానికి తరలించాలని, నంద్యాల పట్టణంలో రైతులకు ఉపయోగపడే నూనెపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డు రెండు ఎకరాల భూమి తెలుగుదేశం పార్టీ ఆఫీస్ కు తీసుకోవడం అన్యాయమని, వెంటనే ఆ భూమి ఖాళీ చేయాలని. నంద్యాల పట్టణాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక, అవసరమైన నిధులు విడుదల చేయాలన్న ప్రధాన డిమాండ్స్ తో ఇప్పటికే నంద్యాల పట్టణంలో అఖిల పక్ష ఐక్య వేదిక ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ప్రచారం చేస్తోంది. అందులో భాగంగానే వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కూడా పట్టణ అభివృద్ధిని కాంక్షిస్తూ 52 వార్డుల్లో పొట్టి చేసి అభ్యర్థులను గెలిపించుకునే ఏర్పాట్లు చేస్తున్నారు. నంద్యాల మున్సిపల్ చైర్మన్ అఖిల పక్ష ఐక్య వేదిక అభ్యర్థిగా యం. వి. రమణా



రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ పేరును ప్రకటించేందుకు సన్నాహాలు, అలాగే నంద్యాల మాజీ మున్సిపల్ సి పి ఎం ఫ్లోర్ లీడర్, సీనియర్ న్యాయవాది బి. శంకరయ్య ప్రతిపదాన మేరకు నూనెపల్లె పరిధిలోని 10 వార్డుల్లో అఖిల పక్ష ఐక్య వేదిక కౌన్సిలర్ అభ్యర్థులు పోటీలో ఉండేందుకు, మంచి అభ్యర్థుల అన్వేషణ ఏర్పాట్లు చేస్తున్నారు

## పోలీస్ సబ్ డివిజన్లో వెంటనే బాలిక ఆచూకీ కనుగొన్న నందికొట్కూరు పోలీసులు

**-బాలిక ఇంట్లో తరచుగా సెల్ ఫోన్ చూస్తుండడంతో తల్లి మందలింపు**

**-నందికొట్కూరు పట్టణంలో బాలిక ఆచూకీ కోసం తక్షణ చర్యలు చేపట్టిన ఎస్ఐ చంద్రశేఖర్**

**-పోలీసుల సేవలపై అభినందనలు తెలిపిన నందికొట్కూరు ప్రజలు**



నందికొట్కూరు సెప్టెంబర్ 8 వార్త సాక్ష్యం



తరచుగా సెల్ ఫోన్ చూస్తూ సెల్ ఫోన్ లోనే మునిగిన ఓ బాలికను తల్లి మందలించడంతో ఇంటి నుంచి అలిగిపోయిన ఓ సంఘటన ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్లో ని నందికొట్కూరు పట్టణంలో ఆ బాలిక ఆచూకీ కోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు సోమవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కర్నూల్ బస్టాండ్ లో నందికొట్కూరు కు చెందిన బాలిక ఆచూకీ ఎస్ఐ చంద్రశేఖర్ వెంటనే ఆ బాలిక ను దగ్గరికి తీసుకొని బాలిక వివరాలను ఉన్నతాధికారులకు చేరవేశాడు పెద్దమ్మ ఇంటి నుంచి తల్లి నంద్యాలలో ఉండడంతో పెద్దమ్మ బాలికను సెల్ ఫోన్ ఎందుకు చూస్తున్నావ్ అని అడగడంతో వెంటనే ఆ బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు గుర్తించారు ఆ బాలిక ఆచూకీ తక్షణమే స్పందించిన నందికొట్కూరు పోలీసులకు ఆ ప్రాంత ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు ఏవైనా సంఘటనలు జరుగుతే తప్పనిసరిగా ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని నందికొట్కూరు ఎస్ఐ చంద్రశేఖర్ ప్రజలకు మీడియా ద్వారా వివరించారు.

## పేటలో రైతు మార్కెట్ ఏర్పాటుకు పట్టణ వాసులు సహకరించాలి

**-రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు**

**-అరటి మార్కెట్ వద్ద రైతు మార్కెట్ నిర్మాణంపై నివాసిత కుటుంబాలు, అధికారులతో టిడిపి నేతల చర్చ**



పాయకరావుపేటసెప్టెంబర్ 8 వార్త సాక్ష్యం :



అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం పాయకరావుపేట పట్టణంలో రైతు మార్కెట్ ఏర్పాటుకు నివాసిత కుటుంబాలు సహా స్థానికులు అన్ని విధాల సహకరించాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు.స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండల టిడిపి అధ్యక్షులు చించలపు ప్రదీప్ ఆధ్వర్యంలో పట్టణ శాఖ అధ్యక్షులు యాళ్ల వరహాలు బాబు అధ్యక్షతన ఇక్కడి అరటి మార్కెట్ వద్ద రైతు మార్కెట్ నిర్మాణంపై పట్టణవాసులు, అధికారులతో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణంలోని అరటికాయల మార్కెట్ వద్ద రైతులు స్వచ్ఛందంగా మార్కెటింగ్ చేసుకునేందుకు ప్రభుత్వం రైతు మార్కెట్ నిర్మాణం కోసం ఇటీవల సంపత్ విభాగ అధికారులు స్థల పరిశీలన చేసిన విషయం తెలిసిందే.ఈ విషయమై ముందుగా స్థానిక టిడిపి నాయకులు పంచాయతీరాజ్, రెవిన్యూ,మార్కెట్ కమిటీ విభాగాల అధికారులు సహా ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న కుటుంబాలతో సమీక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ, ప్రభుత్వం ఇక్కడ చేపట్టే రైతు మార్కెట్ నిర్మాణం విషయమై పట్టణ వాసులు సహా నివాసుంటున్న కుటుంబాలు సహకరించాలని కోరారు. పట్టణ అభివృద్ధి కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.ఇక్కడ నివాసం ఉంటున్న స్థానికుల విషయమై రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితతో చర్చించిన మీదట బాధిత కుటుంబాలకు అన్ని విధాల న్యాయం చేకూరుస్తామని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబాబు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియం కేరి, మండల తెలుగు యువత అధ్యక్షులు గొల్లపల్లి రావు,ఆర్ఐ త్రినాథ్, పంచాయతీ కార్యదర్శి శివరాం, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


## వినాయక మండపాలకు పోలీస్ అనుమతులు తప్పనిసరి

**-పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.వినోద్ బాబు**

**-రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మైకులు డీజేలు ఉపయోగించరాదు**



పాయకరావుపేట సెప్టెంబర్ 8 వార్త సాక్ష్యం :

త్వరలో జరగనున్న వినాయక ఉత్సవాలకు పాయకరావుపేట పట్టణం సహా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శ్రీ గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీసు సహా ఇతరత్రా శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని స్థానిక పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.వినోద్ బాబు ఆదేశించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మైకులు,డీజే సౌండ్లు ఉపయోగించరాదని మంగళ వారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. వినోద్ బాబు పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లా పోలీస్ సూపరిం టెండెంట్ తూహిన్ సిన్హా ఆదేశాల మేరకు మండల పరిధిలోని గ్రామాలు, పట్టణ ప్రాంతా ల్లోని శ్రీ గణేష్ మండపాల నిర్వాహకులకు ముఖ్య సూచనలు నిబంధనలను వెల్లడించారు. -సింగిల్ విండో ద్వారా అనుమతులు మండ పాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు ముందుగా పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి నిర్దేశిత 'సింగిల్ విండో' విధానం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పోలీస్,విద్యుత్, అగ్నిమాపక (ఫైర్), రెవెన్యూ శాఖల నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలన్నారు.

**-కమిటీ సభ్యుల బాధ్యత:**

మండప నిర్వాహక కమిటీ సభ్యుల ఆధార్ కార్డు నకళ్ళు, ఫోన్ నెంబర్లతో కూడిన రాతపూర్వక పత్రాలతో కూడిన వివరాలను పోలీసు లకు సమర్పించాలన్నారు.మండపం వద్ద 24 గంటలూ వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు.

**-మైక్ సెట్లు సహా సౌండ్ సిస్టమ్స్:**

శబ్ద కాలుష్య నియంత్రణ చట్టం ప్రకారం మైక్ సెట్లు, సౌండ్ సిస్టమ్స్ వినియోగానికి ప్రత్యేక అనుమతి తీసుకోవాలని సూచించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మైకులు, డీజేలు ఉపయో గించరాదని సీఐ వినోద్ బాబు తెలిపారు.

**-ట్రాఫిక్‌కు ఆటంకం కలగకూడదు**

ప్రధాన రహదారులు, రద్దీ ప్రదేశాలు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగే విధంగా పందిళ్లు వేయరాదన్నారు.ప్రజలకు, అంబులెన్సులు వంటి అత్యవసర వాహనాలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**-అగ్ని ప్రమాద నివారణ చర్యలు**

మండపాల్లో విద్యుత్ వైరింగ్ మరి ఇతను నాణ్యత కలిగి ఉండాలన్నారు.అగ్ని ప్రమాదాలు జరగకుండా బకెట్లలో నీరు,ఇసుక,ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

**-పర్యావరణ హిత విగ్రహాలు:**

పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మట్టి వినాయక విగ్రహాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని సిఐ వినోద్ బాబు కోరారు.

**-శాంతిభద్రతల పరిరక్షణకు గట్టి భద్రత చర్యలు :**

శ్రీ గణేష్ నిమజ్జన ఉత్సవాల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలకు తావులేకుండా కమిటీ సభ్యులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తీవ్రంగా హెచ్చరించారు.ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా ముగిసేందుకు పోలీసు యంత్రాంగానికి గ్రామ ప్రజలు,యువత, ఉత్సవ కమిటీ సభ్యులు పూర్తి సహకారం అందించాలని సీఐ ఎం.వినోద్ బాబు విజ్ఞప్తి చేశారు. వినాయక విగ్రహాల నిమజ్జనం చేసే తేదీ, సమయం,వెళ్లే దారి, ఎంత మంది కమిటీ సభ్యులతో ఊరేగింపు నిర్వహిస్తున్నరనే వివరాలను ముందుగా చేయనున్న దరఖాస్తులలో నమోదు చేయాలని పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.వినోద్ బాబు తెలియజేశారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడికి 14 రోజుల రిమాండ్

నాదెండ్ల సెప్టెంబర్ 8 వార్త సాక్ష్యం



పాతకక్షల నేపథ్యంలో వేణు అనే వ్యక్తిపై సాయి అనే యువకుడు కత్తితో దాడికి పాల్పడిన హత్యాయత్నం కేసులో నిందితుడికి కోర్టు రిమాండ్ విధించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన నాదెండ్ల పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడు సాయిని అరెస్టు చేశారు. అనంతరం అతడిని చిలకలూరిపేట కోర్టులో హాజరుపరచగా.. నేరం ప్రాథమికంగా రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు నిందితుడిని సబ్ జైలుకు తరలిం.

# వినాయక నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

**-హంద్రీనీవాలో 3 ప్రాంతాల్లో నిమజ్జనానికి అవకాశాలు మంత్రి టీజీ**

**-ప్రస్తుత పరిస్థితిని ప్రజలకు వివరించిన మంత్రి టీజీ భరత్**

కర్నూలు సెప్టెంబర్ 8 వార్త సాక్ష్యం

హంద్రీనీవాలో వినాయక నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సుంకేసులలో నీటి లభ్యత లేని కారణంంగా కె.సి కెనాల్‌కు నీరు విడుదల చేసే పరిస్థితి కనిపించడం లేదని ఆయన తెలియజేశారు. ప్రస్తుత పరిస్థితిని ప్రజలకు వివరిస్తూ మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 2వ తేదీన అధికారులు నిర్వహించిన సమీక్షలో ఈ నెల 14వ తేదీ వరకు మాత్రమే హంద్రీనీవాకు నీరు తీసుకునేందుకు వీలుంటుందని చెప్పారన్నారు. అప్పుడు కూడా చిన్న విగ్రహాలు మాత్రమే హంద్రీనీ వాలో నిమజ్జనం చేసుకునేందుకు వీలుంటుందని చెప్పారన్నారు. తాజాగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్ ఉన్నతాధి కారులతో జరిగిన సమీక్ష సమావేశం తర్వాత.. ఇప్పటి నుండి మరో 12 లేదా 14 రోజుల వరకు హంద్రీనీవాకు నీటిని తీసుకునేందుకు అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. దీంతో పాటు పెద్ద విగ్రహాలు సైతం నిమజ్జనం చేసుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తామని అధికారులు చెప్పినట్లు మంత్రి తెలిపారు. హంద్రీనీవాలో మూడు రోజుల పాటు అంటే వినాయకుడిని ప్రతిష్టించిన తర్వాత 5వ రోజు, 7వ రోజు, 9వ రోజు నిమజ్జనం చేసుకునేందుకు ఇప్పుడున్న పరిస్థితిని బట్టి అవకాశాలు ఉన్నాయ న్నారు. ఇందులో ప్రధానంగా 5వ రోజు, 7వ రోజు నీటి లభ్యత ఎక్కువగా ఉంటుందని.. నిమజ్జనం చేయడానికి అత్యంత అనుకూలంగా ఉంటుందని తెలిపారన్నారు. 9వ రోజు నిమజ్జనానికి ఎంతమేర అనుకూలత ఉంటుందో ఇప్పుడున్న పరిస్థితిని బట్టి ఖచ్చితంగా అంచనా వేయలేమన్నారు. నిమజ్జనం చేసేందుకు నన్నూర్ టోల్‌గేట్, తడకన పల్లె, ఉలిందకొండ వద్ద హంద్రీనీవాలో ఏర్పాట్లు చేస్తామ న్నారు. ఈ మూడు ప్రాంతాల్లో ఏదో ఒక ప్రాంతాన్ని వినాయక నిమజ్జన కమిటీ వారు ఎంపిక చేసి చెబితే.. గత కొన్ని సంవత్సరాలుగా కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ తరుపున నిమజ్జన సమయ ంలో ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారో అదేవిధంగా ఈ ఏడాది కూడా నిమజ్జన కమిటీ ఎంపిక చేసిన ప్రాంతంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ తరుపున పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రజలు ఒక అడుగు లేదా అడుగున్నర మట్టి విగ్రహాలు మాత్రమే ఏర్పాటుచేసుకోవాలని ఆయన



సూచించారు. చిన్న విగ్రహాలైతే ఇంటి వద్దనే నిమజ్జనం చేసుకునేందుకు వీలుంటుందన్నారు. పెద్ద విగ్రహాల నిమజ్జనం కోసం వినాయక నిమజ్జన కమిటీ, అధికారులు ఎంపిక చేసిన ప్రాంతంలో నిమజ్జనం చేస్తామని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఇక వర్షాలు కురిసేందుకు దేవాదాయ శాఖ తరుపున రాష్ట్ర వ్యాప్తంగా వరుణ యాగం చేయాలని క్యాబినెట్ సమావేశంలో చర్చించామని, కర్నూలులో గాయత్రి గోసేవ సమితి ఆధ్వర్యంలో వరుణ యాగం నిర్వహిస్తామన్నారు. వర్షాలు కురిసి సుంకేసులకు నీరు వస్తే కెసి కెనాల్‌కు నీరు వస్తుందన్నారు. అప్పుడు అక్కడ నిమజ్జనం చేసుకోవచ్చున్నారు. అయితే ఇప్పుడున్న పరిస్థితిని బట్టి కె.సి కెనాల్‌లో నిమజ్జనం చేసేందుకు అవకాశం లేదన్నని అర్థం చేసుకొని సహకరించాలని ఆయన ప్రజలను కోరాను.

# కొత్త పెన్షన్ దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి

**-అర్హులైన ప్రతి ఒక్కరూ పెన్షన్ కు దరఖాస్తు చేసుకోవాలి**

**-జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

కర్నూలు, సెప్టెంబర్ 8, వార్త సాక్ష్యం

పెన్షన్‌కు అర్హులైన ప్రతి వ్యక్తి నుంచి దరఖాస్తులు స్వీకరించి, దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి కొత్త పెన్షన్ దరఖాస్తుల అంశం పై మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓ లు, డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్స్,, డిఆర్డిఏ, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియపై రోజువారీ పర్యవేక్షణ చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ, జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారిని ఆదేశించారు..ప్రతి రోజు ఇందుకు సంబంధించిన నివేదిక అందచేయాలని అధికారు లను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పెన్షన్ కు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు కార్యాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా విధుల్లో అందుబాటులో ఉండి దరఖాస్తుదారులకు మార్గనిర్దేశం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ లో పెన్షన్ దరఖా స్తులకు అవసరమైన హౌస్ ట్యాక్స్ డాక్యుమెంట్ల జారీ ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు... పెన్షన్ దరఖాస్తుల కోసం స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్రజలు క్యూ కట్టకుండా అవసరమైన చోట అదనంగా సిబ్బందిని, నాలుగు కంప్యూటర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిష నర్లను, ఎంపీడీవోలను ఆదేశించారు.. పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియకు గడువు తక్కువగా ఉన్నందున వచ్చే వారం



రోజులను అత్యంత ప్రాధాన్యతతో వినియోగించుకోవాలన్నారు.. అర్హతను పరిశీలించి, దరఖాస్తులను స్క్రూటినీ చేయాలని, అవసరమైన ధ్రువపత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలిం చాలన్నారు. ఎక్కడా పొరపాట్లు జరగ కూడదని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. చివరి నిమిష ంలో ఇబ్బందులు తలెత్తకుండా ముం దస్తు పరిశీలన పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం అర్హులైన వారి జాబితాను వెంటనే ప్రచురించేలా చర్యలు తీసుకోవా లన్నారు. ఈ ప్రక్రియను ఆర్డీఓలు నిరంతరం పర్యవేక్షించాలని, ముగ్గురు ఆర్డీఓలతో సమన్వయం చేసుకుని పురోగతిని సమీక్షించాలని కలెక్టర్ డీఆర్‌డీఏ పీడీ ని ఆదేశించారు. అర్హత లేని వ్యక్తుల కు పెన్షన్ మంజూరు చేయకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. పెన్షన్ దరఖాస్తుదారులకు అవసర మైన వైద్య ధ్రువపత్రాలను అదే రోజున జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జీజీహెచ్ సూపరిం టెండెంట్, డిసిహెచ్ఎస్ లను ఆదేశించారు. ఆన్‌లైన్ ప్రక్రియలో సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరిగే అవకాశం ఉంటే, ముందుగా ధ్రువపత్రాన్ని మాన్యువ ల్‌గా జారీ చేసి, అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సాంకేతిక సమస్యలు, సర్టిఫికెట్ల జారీ, దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి ఏ సమస్య ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వీడి యో కాన్ఫరెన్స్ లో కర్నూలు మున్సిపల్ కమిష నర్ ఓబులేసు, జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్ రెడ్డి, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రావు, జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి భాస్కర్ నాయుడు, డీఎంహెచ్వో డా.కామేశ్వర ప్రసాద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, సోషల్ వెల్ఫేర్ డిడి రాధిక, డిసిహెచ్ఎస్ డా.జఫ్రుల్లా, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓ లు తదితరులు పాల్గొన్నారు.

# కోచింగ్ సంస్థల నియంత్రణకు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ

**-50 మందికి పైగా విద్యార్థులు ఉన్న అన్ని కోచింగ్ సంస్థలకు సిఐఆర్ఎంఎస్ నమోదు తప్పనిసరి**

**-జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా**

నంద్యాల, సెప్టెంబర్ 8 వార్త సాక్ష్యం

జిల్లాలో కోచింగ్ సంస్థల కార్యకలాపాలను నియంత్రిస్తూ, విద్యార్థుల సంక్షేమం మరియు భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల (నియంత్రణ, క్రమబ ద్ధీకరణ) నిబంధనలు--2026ను జిల్లాలో సమర్థవ ంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశిం చారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ తొలి సమావేశంను కమిటీ మెంబర్--కన్వీనర్, పి.ఎస్.సి. ఢ కె.వి.ఎస్.సి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శశికళ సంబంధిత శాఖల అధికారులతో నిర్వహి ంచారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..50 మందికి పైగా విద్యార్థులు ఉన్న అన్ని కోచింగ్ సంస్థలు 30 సెప్టెంబర్ 2026 లోగా CIRMS లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థుల భద్రతకు తప్పనిసరి భద్రతా మౌలిక వసతులు కల్పించా లన్నారు. కోచింగ్ సంస్థల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడశీ తప్పనిసరి అని సీసీటీవీ కెమెరాలు, పరిమిత ప్రవేశం కలిగిన పైకప్పులు, 24/7 భద్రతా సిబ్బంది ఏర్పాట్లు పగడ్బందీగా ఉండేలా చూడాలన్నారు. కోచింగ్ సమయాన్ని రోజుకు గరిష్ఠంగా ఐదు గంటలు పరిమితం చేయా లని పాఠశాల వేళల్లో కోచింగ్ తరగతులు నిర్వహి ంచరాదు అన్నారు. విద్యార్థుల పరీక్ష ఫలితాలను ఆధారంగా చేసుకొని బహిరంగంగా అవమా నించడం, ఫలితాలను ప్రదర్శించి విద్యార్థులను కించపరచడం వంటి చర్యలు ఉండకూడదు అన్నారు. ప్రతి కోచింగ్ సెంటర్ నందు వెల్నెస్ సెల్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని అజ్ఞాత (Anonymized) పద్ధతిలో నివేదించే విధానం తప్పనిసరి చేయబడు తుందన్నారు. విద్యార్థులు కోర్సును మధ్యలో నిలిఎ ౨ వేసిన సందర్భంలో చెల్లించిన ఫీజును మిగిలిన కాలానికి అనుగుణంగా జూతీశీ -తీఖ్వ ప్రాతిపదికన తిరిగి చెల్లించడం తప్పనిసరి అని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత మరియు వారికి కల్పిస్తు న్న సౌకర్యాలను పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి అందే ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించేందుకు గ్రీవెన్స్ రెడ్రెసల్ వ్యవస్థను



బలోపేతం చేయాలన్నారు. విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయం నందు grievance dropbox ఏర్పాటు చేయడంతో పాటు డిజిటల్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదులు స్వీకరించి 15 రోజుల్లోగా పరిష్కరించే విధానం అమలు చేయబడుతుందన్నారు. కోచింగ్ సంస్థల నియంత్రణలో విద్య, వైద్య ఆరోగ్యం, పోలీస్, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖల మధ్య సమన్వయంతో భాగస్వామ్యం ఉండాలన్నారు. విద్యార్థులకు ఒత్తిడిలేని, సురక్షితమైన మరియు ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం కల్పించడమే కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనల ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. కోచింగ్ సంస్థలు నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించి విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు

వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR



# ఆయా శాఖలు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను కచ్చితంగా సాధించాలి

**-జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**

కర్నూలు, సెప్టెంబర్ 8 వార్త సాక్ష్యం

ఆయా శాఖలు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను కచ్చితంగా సాధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ సూచనల అమలు, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు అంశాలపై జిల్లా కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్కిల్ డెవలంమెంట్ కార్యక్రమాలకు సంబంధించి స్పష్టమైన రోడ్‌మ్యాప్, ప్రత్యేక వ్యూహాలను రూపొం దించాలని కలెక్టర్ ఆదేశించారు. కెపాసిటీ బిల్డింగ్ శిక్షణలను నిర్ణీత సమయంలో నిర్వహించడంతో పాటు పరిశ్రమలతో భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వాటర్ సెక్యూరిటీకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అవసరమైన చోట్ల కొత్త బోర్ల తవ్వకానికి బదులుగా అందుబాటులో ఉన్న నీటి వనరులను సంరక్షించడం, చెరువులను నింపడం, డీపెనింగ్, ఫ్లషింగ్ వంటి చర్యలను చేపట్టాలని సూచించారు. జలధార, జలహారతి, కార్యక్రమాలను ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని అమలు చేయాలని, ఫామ్ పాండ్స్, పెర్కొలేషన్ ట్యాంక్స్, కంటిన్యూయస్ కాంటూర్ ట్రెంచెస్ తదితర నిర్మాణాల ద్వారా భూగర్భ జలాల రీచార్జ్‌ను పెంచాలని ఆదేశించారు. చేపట్టిన పనులకు సంబంధించి జియో ట్యాగింగ్, వినియోగ వివరాల నమోదు తదితర ప్రక్రియలను నూరు శాతం పూర్తి చేయాలని తెలిపారు. నేచురల్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించేందుకు వ్యవసాయం, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మత్స్య, పశుసంవర్ధక తదితర శాఖల మధ్య సమన్వయంతో కన్వర్జెన్స్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఫామ్ పాండ్స్, క్యాటిల్ షెడ్స్, సంకెన్ పిట్స్ వంటి పనులతో పాటు తక్కువ నీటితో సాగు చేసే పంటలు, తక్కువ వ్యవధి పంటలు, సేంద్రీయ విత్తనాల వినియోగం, సహజ వ్యవసాయ విధానాలపై రైతులకు శిక్షణ, అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ క్యాంపెయిన్, వ్యవసాయం, ఉద్యానవనం, అటవీ శాఖలు చేపడుతున్న కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలన్నారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పశుసంపదకు అవసరమైన పశుగ్రాసం అందుబా టులో ఉండేలా కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.




పరిశ్రమలకు అవసరమైన రోడ్లు, నీటి సరఫరా తదితర మౌలిక వసతులను త్వరగా పూర్తి చేసి, సింగిల్ విండో క్లియరెన్సులను ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కరి ంచాలని సూచిం చారు. జాతీయ రహదారులు, బైపాస్‌లు, జంక్షన్లు, పారిశ్రామిక కారిడార్లకు సంబంధించిన భూసేకరణ సమస్యలను పరిష్కరించడంతో పాటు కాంపాక్ట్ బ్లాక్స్, ఎలియనేషన్ భూములు, పెండింగ్ ఫైళ్లను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. 32 ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన వీశీఖ, భూకేటాయింపు, క్లియరెన్స్ ప్రక్రియలను వేగవంతం చేయాలని, PMFME కింద మంజూరైన రుణాలను అర్హులైన లబ్ధిదారులకు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గార్గేయపురం బోటింగ్, ఓర్వకల్లు రాక్ గార్డెన్, పెద్దతుంబలం పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించిన భూ ప్రతిపాదనలపై పూర్తి వివరాలు సేకరించి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. అక్టోబర్‌లో జరగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పరిశ్రమలు, పెట్టుబ డులు, ఉపాధి అవకాశాల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి వేగంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ సైట్లకు భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని, బల్క్ వేస్ట్ జనరేటర్లు నిబంధనల ప్రకారం సొంత వ్యర్థాల ప్రాసెసింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్, కూరగా యలు--పండ్ల వ్యర్థాలతో కంపోస్ట్ తయారీ, డ్రెయిన్ల శుభ్రత, గ్రీన్ కవర్ పెంపు వంటి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. హాస్టళ్లు, పాఠశాలల నిర్మాణాలు, ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాలు తదితర పనులను వేగంగా పూర్తి చేయాలని, పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేం దుకు రెమిడియల్ క్లాసులు, బ్రిడ్జ్ కోర్సులు నిర్వహిం చాలని కలెక్టర్ సూచించారు. 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా అర్హులైన రైతులందరికీ ప్రయోజనం అందేలా ఆధార్ సీడింగ్, భూమి వివరాల పరిశీల నను వేగవంతం చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీలు, పోషణ్ ట్రాకర్ డేటా,పాఠశాలలు--అంగన్‌వాడీల మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. గ్రామ సభల్లో జనాభా నిర్వహణ, కుటుంబ సంక్షేమం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక అజెండా అంశంగా చేర్చాలని, సంబంధిత శాఖలు సమన్వయంతో ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. వక్ఫ్ భూములను ఆక్రమణల నుంచి రక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని క ఆదేశించారు. ఉమ్మీద్ పోర్టల్‌లో నమోదైన భూముల వివరాలు, రక్షణ చర్యలు, మిగిలిన భూముల గణాంకాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. సమీక్షలో చర్చించిన అన్ని అంశాలపై 10 రోజుల్లోగా ఖచ్చితమైన సమర్పిం చాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, సిపిఓ భారతి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు

# జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యం






**-నిరక్షరాస్యత నిర్మూలనకు సమిష్టి కృషి చేయాలి**
**-అక్షరజ్ఞానంతో ఆత్మగౌరవం, సాధికారత సాధ్యం**
**-మహిళలు సహా ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా మారాలి**
**-జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**






నంద్యాల, సెప్టెంబరు 8 వార్త సాక్ష్యం

జిల్లాలో 100 శాతం నిరక్షరాస్యతను నిర్మూలించి ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు, వాలంటీర్లు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన 60వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు సమిష్టి కృషితో పనిచేయాలని పిలుపునిచ్చారు. అక్షరజ్ఞానం కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడం మాత్రమే కాదని, అది వ్యక్తిలో ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, సాధికారతను పెంపొందించి మెరుగైన జీవనానికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు ఎవరూ విద్యకు దూరంగా ఉండకుండా, చదువులో వెనుకబడిన ప్రతి ఒక్కరూ అక్షరజ్ఞానం పొందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సర్వే ద్వారా జిల్లాలో సుమారు 3.50 లక్షల మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారందరినీ మూడు సంవత్సరాల కాలంలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో "ఉల్లాస్" (అక్షరాంధ్ర) కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. గత ఏడాది నిర్వహించిన ఫేజ్-1లో లక్ష మందికి పైగా అభ్యాసకులకు అక్షరాస్యత అందించే లక్ష్యాన్ని విజయవంతంగా సాధించామని పేర్కొన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని "అక్షరాంధ్ర ఫేజ్-2"ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ దశలో సుమారు 1.12 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకున్నామని, మిగిలిన లక్ష్యాన్ని వచ్చే ఏడాది ఫేజ్-3లో పూర్తి చేసి జిల్లాను 100 శాతం అక్షరాస్యత సాధించిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వివరించారు. ముందుగా అక్షరాలను గుర్తించడం, బోర్డులు, బస్సుల పేర్లు చదవడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను అలవర్చుకోవడంతో చదవడం, రాయడంపై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. కేవలం సంతకం చేయడం వరకు పరిమితం కాకుండా అక్షరాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో బ్యాంకు ఫారాలు నింపడం, ఏటీఎం ద్వారా నగదు తీసుకోవడం, యూపీఐ చెల్లింపులు, మొబైల్ ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం వంటి దైనందిన అవసరాలకు ప్రాథమిక అక్షరాస్యత ఎంతో అవసరమని తెలిపారు. అక్షరజ్ఞానం లేకపోవడం వల్ల ఎవరూ మోసపోకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరికీ కనీస అక్షరాస్యత కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా సంఘాల్లోని చదువుకున్న సభ్యులు, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న చదువుకున్న వారిని వాలంటీర్లుగా ఎంపిక చేసి అభ్యాసకులకు బోధన అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వాలంటీర్లకు 8 పాఠాలతో కూడిన పుస్తకాలను అందించడంతో పాటు అభ్యాసకుల కోసం 32 సాధన పత్రాలు, 4 మోడల్ ప్రశ్నపత్రాలను రూపొందించినట్లు చెప్పారు. పగటిపూట పనులకు వెళ్లే వారి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అనుకూలమైన సమయంలో రోజుకు అరగంట నుంచి గంట వరకు బోధన అందించాలని సూచించారు. వచ్చే మార్చిలో నిర్వహించే తుది పరీక్షలకు అభ్యాసకులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలని, పరీక్షల పట్ల భయాన్ని తొలగించేందుకు బొమ్మలు-అక్షరాలను జత చేయడం, సరళమైన కూడికలు, తీసివేతలు వంటి సులభమైన పద్ధతుల్లో అభ్యాసం కల్పించాలని తెలిపారు. డిజిటల్ హాజరు నమోదు కోసం ప్రత్యేక యాప్‌ను వినియోగించాలని సూచించారు. నేర్చుకోవాలనే తపన, ఆసక్తి ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని, పిల్లలను చూసి తల్లిదండ్రులు, తోటివారిని చూసి ఇతరులు స్ఫూర్తి పొంది చదువుకున్న అనేక ఉదాహరణలు ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చి "ప్రతి వ్యక్తి అక్షరాస్యుడు - ప్రతి కుటుంబం అక్షరాస్య కుటుంబం" అనే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్న అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు, టీమ్ సభ్యులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహి ంచిన బృందాలకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య డీడీ చంద్రశేఖర్ రెడ్డి, డీఈఓ జనార్ధన్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఎల్‌డీఓ శివారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డీపీఓ ఫణికుమార్ నాయక్ తదితర అధికారులు పాల్గొని అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరించారు.

## భూముల రీ సర్వే ప్రక్రియను నిర్దిష్ట గడువు లోపు పూర్తి చేయాలి: జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి

ఒంగోలుసెప్టెంబర్ 8 వార్త సాక్ష్యం :



భూముల రీసర్వే ప్రక్రియను నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి స్పష్టం చేశారు. మంగళవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన ఒంగోలు డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారుల సదస్సులో ఆమె పాల్గొని పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోని వీఆర్వో, ఆర్.ఐ, మండల సర్వేయర్, తహసిల్దార్ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ప్రస్తుతం ఆరో విడత రీసర్వే సాగుతున్నందున మండలాలవారీగా పురోగతిని ఆమె సమీక్షించారు. నిర్దిష్ట గడువులోపు రీసర్వే పూర్తి చేయటంపై ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ దిశగా పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడుకు చెప్పారు. పొరపాటున తమ భూములు 22(ఏ) జాబితాలో నమోదయ్యాయని ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి, వాస్తవాలను పరిగణలోకి తీసుకొని, వారి భూములకు క్లియరెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. మ్యుటేషన్లు కూడా సకాలంలో అయ్యేలా చూడాలన్నారు. వివరాలన్నీ సక్రమంగా ఉన్న భూములకు సంబంధించిన పాస్ పుస్తకాల ప్రింటింగు, పంపిణీ పెంచాలన్నారు. ' సర్ ' కార్యక్రమంలో పెండింగ్ పనులను కూడా త్వరగా పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పి.వెంకటరమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, తహసీల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## శ్రీ వినాయక చవితి వేడుకలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించాలి

**-మండపాల వద్ద భద్రతా చర్యలు తప్పనిసరి: మంత్రాలయం సీఐ దస్తగిరిబాబు**
**-నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: ఎస్ఐ మల్లికార్జున**



మంత్రాలయం,సెప్టెంబర్ 8 వార్త సాక్ష్యం

రాబోయే వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మంత్రాలయం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల వినాయక మండలి సభ్యులు, నిర్వాహకులతో మంత్రాలయం సీఐ దస్తగిరిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మల్లికార్జున పాల్గొని పలు సూచనలు చేశారు. వినాయక మండపాల ఏర్పాటుకు సంబంధిత శాఖల అనుమతులు ముందుగానే పొందాలని, ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సూచించారు. విద్యుత్ వైరింగ్, అగ్ని ప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సాధ్యమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. లౌడ్‌స్పీకర్లు, డీజేలను ప్రభుత్వ నిబంధనలకు, నిర్ణీత సమయాలకు అనుగుణంగా మాత్రమే వినియోగించాలని సూచించారు. ఇతర మతాలు, వర్గాల మనోభావాలను కించపరిచే పోస్టర్లు, పాటలు, కార్యక్రమాలు నిర్వహించరాదని, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు చేయరాదని హెచ్చరించారు. మండపాల వద్ద మహిళలు, చిన్నారులు, వృద్ధులకు ఇబ్బందులు కలగకుండా వాలంటీర్లు క్రమశిక్షణతో వ్యవహరించాలని, బలవంతపు విరాళాల సేకరణ, మద్యం, జూదం, గొడవలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వరాదని తెలిపారు. నిమజ్జనం సమయంలో పోలీస్ శాఖ సూచించిన మార్గాలు, సమయాలు, నిబంధనలు పాటించాలని, ఊరేగింపుల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఐ దస్తగిరిబాబు సూచించారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా నిర్వహిస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతలకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో మంత్రాలయం పోలీస్ ఇబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన అందరికీ కొత్త పెంక్షన్ లు అందజేసె విధంగా కృషి చేయాలి:బెహరా

గోపాలపట్నంసెప్టెంబర్ 8 వార్త సాక్ష్యం :



జనసేన పార్టీ ఆధ్వర్యంలో 92 వ వార్డు వెంకటాపురం మూడు గుళ్ళు దగ్గర ధవళ గోపాల్ ఆధ్వర్యంలో పెన్షన్లు కొరకు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి సేవలు అందిస్తున్న కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కర రావు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో పెన్షన్ కి అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి పెన్షన్ అందే విధంగా జనసేన పార్టీ కృషి చేస్తుందని, లబ్ధిదారులందరికీ పెన్షన్ అందేటట్లుగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు, ఈ కార్యక్రమంలో ధవళ మోహన్ కంపర కోటీశ్వరరావు నరేష్, గొంతిన శ్రీనివాసరావు, ధవళ మారయ్య, పాల బాబురావు, ఇల్లపు సురేష్, మనోహర్ బోడి రాంబాబు, త్రినాథ్, తుంపాల బాబురావు, రాము మాస్టర్, గణేష్, ధవళ రాంబాబు, గొంతిన నాగరాజు, పీతల అప్పలరాజు, దాలి బోయిన శంకర్రావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, మామిడి రామకృష్ణ, బలిజ అప్పలనాయుడు, గొంతిన శ్రీనివాసరావు, రామారావు, అట్టా శంకర్ రమణ, రమేష్ రెడ్డి, అక్కిరెడ్డి నాగరాజు, అభిరామ్, గొంతిన జగదీష్, నానాజీ, గొంతిన బాబు, గొంతిన కృష్ణ, కంద గణేష్, గంట్ల గణేష్, ఇల్లపు శ్రీను, చింతల శ్రీను, ఇల్లపు కన్నారావు కంపర రమణ, కంపర శంకరరావు, దాసరి జ్యోతి, బల్ల రమణ, కరణం కన్నారావు, చిన్ని దివాకర్ జనసేన పార్టీ నాయకులు,కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# బిజినెస్

## తగ్గుతున్న ఉత్పత్తి.. పెరుగుతున్న ధరలు.. కాపర్‌కు ఎందుకింత డిమాండ్?



అంతర్జాతీయ మార్కెట్లో రాగి (కాపర్) ధర చుక్కలనంటుతోంది. లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్ (ఎల్ఎంఈ)లో రాగి ధర చారిత్రాత్మక గరిష్ట స్థాయికి చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. శుద్ధి చేసిన రాగిపై అమెరికా భారీగా సుంకాలు (టారిఫ్‌లు) విధించవచ్చన్న అంచనాలతో వ్యాపారులు పెద్ద ఎత్తున నిల్వలను అమెరికాకు తరలిస్తుండటమే ఈ అనూహ్య పెరుగుదలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇవాళ ట్రేడింగ్‌లో ఎల్ఎంఈలో మూడు నెలల కాపర్ ఫ్యూచర్స్ ధర 0.8 శాతం పెరిగి మెట్రిక్ టన్నుకు 14,533 డాలర్ల (రూ. 13.73లక్షలు)వద్ద ఆల్ టైమ్ హైకి చేరింది. ఈ ఏడాది జనవరిలో నమోదైన 14,527.50 డాలర్ల (రూ. 13.72లక్షలు) రికార్డును ఇది అధిగమించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రాగి ధర సుమారు 17 శాతం పెర్గగా, గత 12 నెలల్లో ఏకంగా 47 శాతం మేర వృద్ధిని నమోదు చేసింది. ఈ ప్రభావం దేశీయ మార్కెట్లపైనా స్పష్టంగా కనిపిస్తోంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో సెప్టెంబర్ కాపర్ ఫ్యూచర్స్ 1.21 శాతం (రూ. 16.8) పెరిగి ఉదయం 10:30 గంటలకే రూ. 1,403.50 ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్తాన్ కాపర్ లిమిటెడ్ షేర్లు కూడా బీఎస్ఈలో 5 శాతానికి పైగా లాభపడి రూ. 537.35 వద్ద ట్రేడ్ అయ్యాయి.

## ఆపిల్ నుంచి తొలి ఫోల్డబుల్ ఐఫోన్.. !

టెక్ దిగ్గజం ఆపిల్ నుంచి ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఫోల్డబుల్ ఐఫోన్ రాబోతున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ 9న జరిగే 'సర్‌ప్రైజ్ అండ్ షైన్' ఈవెంట్‌లో ఈ సరికొత్త ఫోన్‌ను ఆవిష్కరించేందుకు కంపెనీ సిద్ధమైనట్లు సమాచారం. ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ మోడళ్లతో పాటు దీనిని కూడా లాంచ్ చేస్తారని అంచనా వేస్తున్నారు. ఈ ఫోల్డబుల్ ఫోన్‌కు 'ఐఫోన్ అల్ట్రా' లేదా 'ఐఫోన్ ఫోల్డ్' అని పేరు పెట్టవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.వివిధ నివేదికల ప్రకారం, ఇది పుస్తకంలా పక్కకు తెరుచుకునే (బుక్-స్టైల్) డిజైన్‌లో రానుంది. ఫోన్‌ను మడిచినప్పుడు ముందు వైపు ఉండే కవర్ డిస్‌ప్లే సుమారు 5.3 నుంచి 5.5 అంగుళాలు ఉండొచ్చు. తెరిచినప్పుడు లోపలి ప్రధాన స్క్రీన్ 7.6 నుంచి 7.8 అంగుళాల వరకు ఉంటుందని అంచనా. ముఖ్యంగా, స్క్రీన్ మధ్యలో మడత దాదాపు కనిపించకుండా, చాలా పలచని నిర్మాణంతో దీనిని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఫ్రేమ్ కోసం టైటానియం-అల్యూమినియం మిశ్రమాన్ని వాడొచ్చని తెలుస్తోంది. హార్డ్‌వేర్ విషయానికొస్తే, ఇందులో ఆపిల్ నెక్స్ట్ జనరేషన్ ఏ20 లేదా ఏ20 ప్రో చిప్‌ను వాడనున్నట్లు తెలుస్తోంది. సుమారు 12 జీబీ ర్యామ్‌తో ఇది పనిచేస్తుంది. వెనుక వైపు 48 ఎంపీ వైడ్, అల్ట్రావైడ్ లెన్స్‌లతో కూడిన డ్యూయల్ కెమెరా సెటప్ ఉండొచ్చు. అయితే,



స్థలాభావం వల్ల టెలిఫోటో లెన్స్ ఉండకపోవచ్చని అంటున్నారు. పవర్ బటన్‌లోనే టచ్ ఐడీని అమర్చవచ్చని, ఫేస్ ఐడీకి బదులుగా దీనిని వాడొచ్చని లీక్స్ చెబుతున్నాయి. బ్యాటరీ సామర్థ్యం 5,000 నుంచి 5,800 ఎంఏహెచ్ మధ్య ఉండొచ్చని అంచనా.ధర విషయంలో ఇది అత్యంత ప్రీమియం ఉత్పత్తిగా నిలవ నుంది. దీని ప్రారంభ ధర 2,000 నుంచి 2,500 డాలర్ల మధ్య ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సెప్టెంబర్ 9న ప్రకటన వెలువడిన తర్వాత, ఐఫోన్ 18 సిరీస్‌తో పాటే దీని ప్రీ-ఆర్డర్లు మొదలుకావొచ్చు. సెప్టెంబర్ చివరిలో లేదా అక్టోబర్ మధ్యలో డెలివరీలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఫోల్డబుల్ మార్కెట్‌లో ఉన్న ఇతర కంపెనీలకు ఇది గట్టి పోటీ ఇస్తుందని భావిస్తున్నారు. అయితే, ఈ వివరాలన్నీ లీక్స్ ఆధారంగా వచ్చినవేనని, సెప్టెంబర్ 9న జరిగే అధికారిక ఈవెంట్‌లో పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## పండగ వేళ స్వీట్లకు ధరల సెగ.. 30 శాతం పెరిగిన మిఠాయిల ధరలు

దసరా, దీపావళి పండగలు సమీపిస్తున్న వేళ వినియోగదారులకు చేదువార్త. పండగ పూట బంధుమిత్రులతో కలిసి నోరు తీపి చేసుకుందామనుకుంటే జేబుకు చిల్లు పడటం ఖాయంగా కనిపిస్తోంది. స్వీట్ల తయారీలో ఉపయోగించే ప్రధాన ముడిసరుకుల ధరలు ఆకాశాన్నంటడంతో మిఠాయిల ధరలు భారీగా పెరిగాయి. సుమారు 30 శాతం వరకు ధరలు పెరిగినట్లు స్వీట్ షాపుల యజమానులు చెబుతున్నారు. గత కొన్ని నెలలుగా పంచదార, బెల్లం, పాల ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. రెండు నెలల క్రితం రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.40-45గా ఉన్న పంచదార ధర ఇప్పుడు రూ.65-70కి చేరింది. అదేవిధంగా, మంచి నాణ్యమైన బెల్లం కిలో ధర రూ.70-80 నుంచి ఏకంగా రూ.90-100కి పెరిగింది. ఇక పాల ధరలు కూడా గత నాలుగు నెలల్లో 16 శాతం వరకు పెరిగాయని వ్యాపారులు వాపోతున్నారు. ఈ ముడిసరుకుల ధరల పెరుగుదల ప్రభావం నేరుగా స్వీట్లపై పడింది. ఉదాహరణకు, రెండు నెలల క్రితం కిలో రూ.550-560గా ఉన్న ఖోవా పేడా ధర ఇప్పుడు రూ.750-780కి పెరగడమే ఇందుకు నిదర్శనం. పెరిగిన ఖర్చుల భారాన్ని తట్టుకునేందుకు ధరలు పెంచక తప్పడం లేదని వ్యాపారులు వివరిస్తున్నారు. పరిస్థితి ఇక్కడితో ఆగేలా కనిపించడం లేదు. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, ఎల్‌నినో ప్రభావం వంటి కారణాలతో భవిష్యత్తులో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పంచదార



ధరల పెరుగుదల ప్రభావం త్వరలో బిస్కెట్లు, శీతల పానీయాల కంపెనీలపైనా పడనుంది. బిస్కెట్ల ధరలు 2 నుంచి 4 శాతం పెరగవచ్చని లేదా ప్యాకెట్ల పరిమాణాన్ని తగ్గించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు

## అలాంటప్పుడే నా బెస్ట్ గేమ్ బయటకొస్తుంది- ఇషాన్ కిషన్ ఆసక్తికర వ్యాఖ్యలు

కీలక మ్యాచ్‌లలో ఒత్తిడి పెరిగినప్పుడే తనలోని అత్యుత్తమ ఆట బయటకు వస్తుందని భారత బ్యాటర్, ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ అన్నాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్‌పై 270 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆడిన తర్వాత అతడు తన ఆటతీరుపై ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. చెపాక్‌లో జరిగిన మ్యాచ్‌లో కిషన్ 334 బంతుల్లో 270 పరుగులు చేశాడు. ఇందులో 30 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. అతడి ఇన్నింగ్స్‌తో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు సాధించింది. దులీప్ ట్రోఫీ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోర్ల జాబితాలో కిషన్ 270 పరుగులు ఎనిమిదో స్థానంలో నిలిచాయి. పెద్ద మ్యాచ్‌లలో ఒత్తిడి తన ఆటకు మరింత ఉపయోగపడుతుందని కిషన్ చెప్పాడు. వికెట్లు త్వరగా పడిపోయిన సందర్భాల్లో కూడా తాను బ్యాటింగ్‌ను ఆస్వాదిస్తానన్నాడు. ప్రశాంతంగా ఉంటూనే దూకుడుగా ఆడటం తనకు బాగా కలిసొస్తుందని వివరించాడు. తన వ్యక్తిగత స్కోరుపై కాకుండా జట్టు లక్ష్యంపై దృష్టి పెట్టినట్లు కిషన్ తెలిపాడు. 400 పరుగులు పూర్తయితే ముందుగా 450కి చేరుకోవాలని.. తర్వాత 500 పరుగుల లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు చెప్పాడు. ఇలా చిన్న చిన్న లక్ష్యాలుగా విడగొట్టుకోవడం వల్లే సుదీర్ఘ ఇన్నింగ్స్ ఆడగలిగానన్నాడు. చెపాక్‌లో పరిస్థితులు బ్యాటర్లకు అంత సులభంగా లేవని కిషన్ చెప్పాడు. మైదానం ఒకవైపు బౌండరీ చాలా దూరంగా ఉండటంతో పాట్లకు ఎక్కువ శ్రమ పెట్టాల్సి వచ్చిందన్నాడు. బంతి మెత్తబడటంతో బౌండరీలు సాధించడం మరింత కష్టంగా మారిందని తెలిపాడు. మహ్మద్ సిరాజ్ షార్ట్ బాల్స్ వేసినప్పుడు వికెట్ కోల్పోకుండా ఉండేందుకు తన బ్యాటింగ్ భంగిమను మార్చుకున్నట్లు కిషన్ చెప్పాడు. బంతిని బలంగా కొట్టే ప్రయత్నంలో వికెట్ చేజారకుండా జాగ్రత్త పడ్డానన్నాడు. కుమార్ కుషాగ్రతో కలిసి కిషన్ కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. కుషాగ్ర 132 బంతుల్లో 101 పరుగులు చేశాడు. ఆ తర్వాత కూడా కిషన్ అదే జోరును కొనసాగించాడు. 270 పరుగుల వద్ద



లాంగ్‌ఆన్ సమీపంలో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ట్రిపుల్ సెంచరీకి అతడు 30 పరుగుల దూరంలో నిలిచిపోయాడు.తన భారీ ఇన్నింగ్స్‌లో షాట్లు ఆడేందుకు పెద్దగా రిస్క్ తీసుకోలేదని కిషన్ చెప్పాడు. సరైన బంతులను ఎంచుకుని ఆడటం తనకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందన్నాడు.

## భారత్‌తో చారిత్రాత్మక ఏకైక టీ20 మ్యాచ్‌కు జట్టును ప్రకటించిన జపాన్

క్రికెట్ ప్రపంచంలో ఒక చారిత్రాత్మక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టు, తొలిసారిగా జపాన్‌తో అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడనుంది. ఇరు దేశాల మధ్య 75 ఏళ్ల దౌత్య సంబంధాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ప్రత్యేక మ్యాచ్‌ను నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 22న టోగిరి ప్రిఫెక్చర్‌లోని సానో అంతర్జాతీయ క్రికెట్ గ్రౌండ్‌లో ఈ మ్యాచ్ జరగనుంది.ఈ చారిత్రక మ్యాచ్‌కు 'సుజుకీ కప్' అని పేరు పెట్టారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనే టకాయిచి మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన ఒప్పందం మేరకు 'స్పోర్ట్స్ 75' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇరు దేశాల మధ్య క్రీడా రంగంలో సహకారాన్ని, సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహించడమే దీని లక్ష్యం. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగానే ఈ టీ20 మ్యాచ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ మ్యాచ్ ద్వారా జపాన్, తూర్పు ఆసియా దేశాల్లో క్రికెట్‌కు మరింత ప్రాచుర్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ మ్యాచ్ కోసం జపాన్ తమ జట్టును ప్రకటించింది. మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న ఆసియా క్రీడల కోసం ఎంపిక చేసిన జట్టునే ఈ మ్యాచ్‌కు కూడా ఎంపిక చేయడం విశేషం. టీ20 ఫార్మాట్‌లో జపాన్ తరఫున అత్యధిక పరుగులు చేసిన కెండెల్ కడోవాకీ-ఫ్లెమింగ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ జేక్ కుసుడా-నైర్న్ తొలిసారిగా జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఆసియా క్రీడల సన్నద్ధతకు ప్రాధాన్యత ఇస్తున్నందున, ఐసీసీ నిబంధనల ప్రకారం అర్హత ఉండి, ఆసియా క్రీడల నిబంధనల ప్రకారం అనర్హులైన ఆటగాళ్లను ఈ మ్యాచ్‌కు ఎంపిక చేయలేదని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. కెప్టెన్ ఫ్లెమింగ్‌తో పాటు ఇబ్రహీం తకహాషి, డెక్లాన్ సుజుకీ-మెక్‌కోంబ్ వంటి



50కి పైగా టీ20లు ఆడిన అనుభవజ్ఞులు జట్టులో ఉన్నారు. 2013లో తొలిసారి జపాన్‌కు ప్రాతినిధ్యం వహించిన సుయోషి టకాడా తిరిగి జట్టులోకి వచ్చాడు. ఈ చారిత్రక మ్యాచ్‌పై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా హర్షం వ్యక్తం చేశారు. "భారత్, జపాన్ మధ్య జరుగుతున్న ఈ ప్రత్యేక టీ20 మ్యాచ్‌లో భాగం కావడం చాలా సంతోషంగా ఉంది. భారత జట్టు ఒక కొత్త దేశంలో అడుగుపెట్టడం క్రికెట్‌కు ఒక ముఖ్యమైన ఘట్టం.

# స్పోర్ట్స్

## ఆఫ్ఘన్ సిరీస్‌కు ముందు టీమిండియాకు గుడ్ న్యూస్.. కీలక ఆల్‌రౌండర్ ఫిట్



ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు ముందు టీమిండియాకు గుడ్ న్యూస్ అందింది. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. దీంతో సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల సిరీస్‌కు అతడు అందుబాటులో ఉంటాడు. అయితే స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా సహా మరో ఇద్దరు ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై ఇంకా స్పష్టత రాలేదు. బుమ్రా ఇంకా మ్యాచ్ సిమ్యులేషన్ పూర్తి చేయలేదు. సెప్టెంబర్ 9న అతడు మ్యాచ్ సిమ్యులేషన్‌కు హాజరయ్యే అవకాశం ఉంది. ఆ తర్వాతే ఆఫ్ఘన్ సిరీస్‌లో అతడిని ఆడించాలా? వద్దా? అనే దానిపై బీసీసీఐ తుది నిర్ణయం తీసుకోనుంది. సిరీస్ ప్రారంభానికి కేవలం నాలుగు రోజుల ముందు ఈ నిర్ణయం రావాల్సి ఉండటంతో బుమ్రా విషయంలో ఉత్కంఠ నెలకొంది. మరోవైపు హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి ఫిట్‌నెస్ పరీక్షలు, మ్యాచ్ సిమ్యులేషన్లు పూర్తి చేసుకున్నారు. అయితే వారికి ఇంకా బీసీసీఐ నుంచి తుది ఫిట్‌నెస్ క్లియరెన్స్ రాలేదు. ఈ ముగ్గురి విషయంలో సెప్టెంబర్ 9 సాయంత్రానికి తుది నివేదిక వచ్చే అవకాశం ఉంది. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో వరుసగా ఆరు టీ20 మ్యాచ్‌ల్లో ఓడిన భారత్.. ఆఫ్ఘన్ సిరీస్‌కు పూర్తి స్థాయి జట్టును ఎంపిక చేసింది. సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో ఢిల్లీలో మూడు టీ20లు జరగనున్నాయి. ఇక హార్దిక్ పాండ్యా మాత్రం జట్టుకు దూరంగానే ఉన్నాడు. ఐపీఎల్‌లో గాయపడిన అతడు ఇంకా పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించలేదు.

# చైనాలో మార్మోగిన ప్రభాస్-త్రిష పాట

# షాంపై యువతి అదిరిపోయే డాన్స్



ప్రభాస్ కెరీర్‌లో వచ్చిన సినిమాల్లో కొన్ని బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా.. వాటిలోని పాటలు మాత్రం ఇప్పటికీ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నాయి. అలాంటి వాటిలో 'పౌర్ణమి' ఒకటి. ప్రభాస్, త్రిష, ఛార్మి నటించిన ఈ సినిమాలోని పాటలకు అప్పట్లోనే మంచి ఆదరణ లభించింది. ముఖ్యంగా 'భరత వేదముగా' పాటకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. 2006లో విడుదలైన ఈ పాట ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనికి కారణం ఓ చైనా డ్యాన్సర్ చేసిన అద్భుతమైన నృత్య ప్రదర్శన. మీరా వాంగ్ అనే చైనీస్ డ్యాన్సర్ 'భరత వేదముగా' పాటకు భారతీయ శాస్త్రీయ నృత్య శైలిలో చేసిన డ్యాన్స్ వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. పాటకు తగ్గట్టుగా ఆమె వేసిన అడుగులు, హావభావాలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. తెలుగు భాష తెలియని చైనాకు చెందిన ఓ డ్యాన్సర్ మన సినిమా పాటను ఎంచుకుని ఇంత అందంగా నృత్యం చేయడం ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఆమె ప్రదర్శనకు సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతు న్నాయి. దీంతో దాదాపు రెండు దశాబ్దాల క్రితం వచ్చిన 'భరత వేదముగా' పాటకు మరోసారి భారీగా రీచ్ వస్తోంది. మీరా వాంగ్‌కు భారతీయ శాస్త్రీయ నృత్యంపై ఎంతో ఆసక్తి ఉన్నట్లు తెలుస్తోంది. ఆమె అనంతపురానికి చెందిన వేణుగోపాల్ వద్ద కూచిపూడి నేర్చుకుంటున్నట్లు సమాచారం. భారత్‌కు రాకుండానే కూచిపూడి నృత్యాన్ని అభ్యసిస్తూ.. తన ప్రదర్శనలను సోషల్ మీడియాలో పంచుకుంటున్నారట. అంతేకాదు.. 'మాయాబజార్'లోని 'అహా నా పెళ్లంట' పాటకు కూడా ఆమె నృత్యం చేసిన వీడియోలు ఉన్నట్లు తెలుస్తోంది. భాష, దేశాల సరిహద్దులు దాటి తెలుగు సినిమా పాటకు వస్తున్న ఈ స్పందన ఇప్పుడు టాలీవుడ్ అభిమానులను కూడా ఆకట్టుకుంటోంది.





## 75 ఏళ్ల వయసులోనూ ఫిట్‌నెస్ ఐకాన్

## మమ్ముట్టి యంగ్ లుక్ సీక్రెట్ ఇదే!

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి సెప్టెంబర్ 7న 75వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈ వయసులోనూ ఆయన ఫిట్‌నెస్, యంగ్ లుక్ చూసి సినీ పరిశ్రమ, అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. కండరాల బలం, శారీరక చురుకుదనం సహజంగా తగ్గే వయసులో కూడా ఆయన ఎంతో ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండటం వెనుక ఒక క్రమశిక్షణతో కూడిన జీవనశైలి ఉంది. పరిమితంగా ఆహారం తీసుకోవడం, క్రమం తప్పని వ్యాయామం, సరైన నిద్ర వంటి అలవాట్లే ఆయన ఫిట్‌నెస్ రహస్యాలుగా తెలుస్తోంది. సూర్యకు స్ఫూర్తినిచ్చిన మమ్ముట్టి తమిళ స్టార్ హీరో సూర్య సైతం మమ్ముట్టి ఆహారపు అలవాట్ల నుంచి స్ఫూర్తి పొందినట్లు గతంలో ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. "ఇష్టమైనది ఏదైనా తినొచ్చు, కానీ ఇష్టమొచ్చినంత తినకూడదు, కడుపు సగం నిండే వరకే తినాలి" అని మమ్ముట్టి తనకు సలహా ఇచ్చినట్లు సూర్య గుర్తుచేసుకున్నారు. పూర్తిగా మానేయడం కంటే, పరిమితంగా తినడమే మమ్ముట్టి డైట్‌లో కీలక సూత్రం.

## యశ్ 'టాక్సిక్'కు ఊహించని షాక్

## 150 కోట్ల నుంచి 30 కోట్లకు పడిపోయిన ఓటీటీ డీల్ ?

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా, గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో వచ్చిన పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. 'కేజీఎఫ్ 2' లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత యశ్ నటించిన సినిమా కావడంతో దీనిపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, థియేటర్లలో ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. ఈ ప్రభావం ఇప్పుడు సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులపై తీవ్రంగా పడినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. విడుదలకు ముందు కోట్లు కుమ్మరించేందుకు సిద్ధపడిన ఓటీటీ సంస్థలు, ఇప్పుడు ముఖం చాటేస్తున్నాయని సమాచారం. విడుదలకు ముందు 'టాక్సిక్' సినిమాకున్న హైప్‌ను క్యాష్ చేసుకునేందుకు ఓ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ డిజిటల్ హక్కుల కోసం ఏకంగా రూ.150 కోట్లు ఆఫర్ చేసినట్లు ప్రచారం జరిగింది. యశ్ క్రేజ్, సినిమాలో స్టార్ హీరోయిన్లు, బోల్డ్ కంటెంట్‌తో కూడిన టీజర్ వంటి అంశాలు ఈ భారీ ఆఫర్‌కు కారణంగా నిలిచాయి. అయితే, థియేటర్లలో సినిమా బ్లాక్‌బస్టర్ అయితే డిజిటల్ రైట్స్ విలువ రూ.200 కోట్లకు పైగా పలుకుతుందని భావించిన నిర్మాతలు ఆ ఆఫర్‌ను తిరస్కరించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. కానీ, బాక్సాఫీస్ వద్ద సినిమా ఫలితం తారుమారు కావడంతో ఇప్పుడు ఓటీటీ లెక్కలు పూర్తిగా మారిపోయాయి. తాజా సమాచారం ప్రకారం ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ సినిమా డిజిటల్ హక్కుల కోసం కేవలం రూ.30 కోట్లు మాత్రమే ఆఫర్ చేసినట్లు ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తోంది. విడుదలకు ముందు వచ్చిన ఆఫర్‌తో పోలిస్తే ఇది దాదాపు ఐదో వంతు మాత్రమే. సినిమా ఫలితం ఓటీటీ మార్కెట్‌ను ఎంతలా ప్రభావితం చేస్తుందో చెప్పడానికి ఇదే నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ రూ.150 కోట్ల ఆఫర్, ప్రస్తుత రూ.30 కోట్ల డీల్‌పై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు, ఈ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ లభించడం శాటిలైట్ హక్కుల విషయంలో కొత్త సమస్యలు తెచ్చిపెట్టింది. బోల్డ్ కంటెంట్ కారణంగా సినిమాను యథాతథంగా టీవీలో ప్రసారం చేయడం కష్టం. అందుకే, కుటుంబ ప్రేక్షకుల కోసం కొన్ని సన్నివేశాలను తొలగించి లేదా మార్పులు చేసి, ప్రత్యేకంగా ఓ వెర్షన్‌ను సిద్ధం చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే ఓటీటీ కోసం కూడా మరో వెర్షన్‌ను రూపొందించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.




PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.